# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 25 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సూపర్ స్పెషాలిటీ, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ వ్యయం తగ్గింపు

- రూ.6,714 నుంచి రూ.5,001 కోట్లకు తగ్గుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.1,715 కోట్లకు తగ్గించింది. ఈ మేరకు గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. రాష్ట్ర చరిత్రలో నిర్మాణ వ్యయాన్ని తగ్గించడం ఇదే తొలిసారి. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, టిమ్స్‌ల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.3,779 కోట్లు వ్యయమవుతుందని గత బీఆర్ఎస్ సర్కార్ అంచనా వేసింది. ఆ మేరకు 2021లో జీవోలు జారీ చేసింది. అనంతరం రెండేండ్లలో నిర్మాణ వ్యయాన్ని రూ.6,714 కోట్లకు కేసీఆర్ సర్కార్ పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యయం పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. నిర్మాణ వ్యయం పెంపులో నిబంధనలు ఉల్లంఘించినట్టు ఎంక్వైరీ కమిటీ గుర్తించింది. కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకు అడ్డగోలు నిర్మాణ వ్యయాన్ని పెంచినట్టు సర్కారు నిర్ధారణకు వచ్చింది. దీంతో రూ.6,714 కోట్ల నుంచి రూ.5,001 కోట్లకు నిర్మాణ వ్యయాన్ని తగ్గించింది. క్యాబినెట్‌లో సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపింది.

# మున్సిపాల్టీలకు నజరానా

- రూ.2780 కోట్లు విడుదల చేసిన సర్కారు
- 138 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 2432 పనులకు ఆమోదం
- వెంటనే టెండర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో అభివద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. 138 పురపాలికలకు రూ.2780 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ కోర్ అర్బన్ సిటీని మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాల్టీల్లో అభివద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు మున్సిపల్ శాఖ ఈ నిధులు మంజూరు చేసింది. తెలంగాణ రైజింగ్ విజన్-2027లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రమంతటా ఉన్న పట్టణాలను గ్రోత్‌హబ్‌గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన అభివద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉన్న మున్సిపాల్టీల విస్తరణతో పాటు కొత్తగా ఏర్పడిన వాటిలోనూ మెరుగైన పౌర సదుపాయాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అభివృద్ధి పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ శాఖ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని 138 మున్సిపాల్టీల్లో రూ. 2,780 కోట్ల ఖర్చుతో 2,432 పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపరిచిన నగరాభివృద్ధి నిధులతో పాటు అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) పథకాల నుంచి ఈ నిధులను మంజూరు చేసింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాల్టీలకు రూ.15 కోట్లు, అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన మున్సిపాల్టీలకు రూ. 20 కోట్లు, పాత మున్సిపాల్టీలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు రూ. 30 కోట్లు మంజూరు చేశారు. ప్రాధాన్యత క్రమంలో ఈ నిధులను ఖర్చు చేయాలని మున్సిపల్ శాఖ మార్గదర్శకాలను రూపొందించింది. మున్సిపాల్టీల్లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధి, అంతర్గత రహదారుల నిర్మాణం, వర్షపు నీరు, మురుగు నీటికి డ్రెయిన్ల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, చెరువులు, కుంటల్లో కాలుష్య నివారణ, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించిన ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణ పనులకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అన్ని మున్సిపాల్టీల్లో సంబంధిత విభాగాలు వెంటనే టెండర్లు పిలిచి ఈ పనులు ప్రారంభించాలని ఆదేవించారు. 2026 మార్చి నాటికి అన్ని పనులను పూర్తి చేయాలంటూ గడువు విధించారు.

# ఘోర బస్సు ప్రమాదం

- ఏపీ కర్నూలు జిల్లాలో ప్రయివేటు బస్సును ఢీకొన్న బైకర్
- దగ్ధమైన ప్రైవేట్ స్లీపర్
- 19 మంది సజీవ దహనం..
- రాష్ట్రపతి, ప్రధాని, సీఎం తదితరుల దిగ్భ్రాంతి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ ప్రైవేట్ ఎసీ స్లీపర్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతయింది. ఈ దారుణ ఘటనలో 19 మంది ప్రయాణికులు బస్సులోనే సజీవదహనమయ్యారు. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు అగ్నికి గురవడంతో మంటలు క్షణాల్లో వ్యాపించి, మొత్తం బస్సు కాలిపోయింది. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు కూడా మృతిచెందాడు. ఈ ఘోర దుర్ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు ఎసి స్లీపర్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతి కావడంతో 19 మంది బస్సులోనే సజీవ దహనమయ్యారు. మిగిలిన వారు అతికష్టం మీద బస్సు అద్దాలను పగలకొట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్న టేకూరు దాటిన తర్వాత తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఓ ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన బస్సు దాన్ని ఢకొనెడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ద్విచక్రవాహనం బస్సుకిందకు దూసుకుపోయి ఇరుక్కుపోగా, దాని నుండి చెలరేగిన మంటలు బస్సుకు అంటుకున్నాయి. ఇంత జరిగినా బస్సు ఆగకపోవడం, విపరీతమైన వేగంతో ముందుకు దూసుకుపోవడంతో శర వేగంగా వ్యాపించిన మంటలు క్షణాల్లోనే బస్సును భస్మీపటలం చేశాయి. వెనుకవైపు ఎమర్జన్సీడోర్‌లు తెరుచుకోకపోవడం, పగలకొట్టడానికి వీలులేనంత గట్టిగా బస్సు అద్దాలు ఉండటం, పగలకొట్టడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పాటు, ముందువైపు తలుపు కూడా తెరుచుకోకపో వడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. అతికష్టం మీద అద్దాలు పగలకొట్టుకుని కొందరు బయటకు రాగలిగారు. బస్సులో నుంచి బయటకు రాలేని 19 మంది బస్సులోనే సజీవ దహనం అయ్యారు. మృతదేహాలు మాంసపు ముద్దలుగా మారి గుర్తుపట్టలేనట్లుగా కాలిపోయాయి. ద్విచక్ర వాహనంపై కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తున్న కర్నూలు ప్రజానగర్‌కు చెందిన శివశంకర్ (21) ఎగిరి రోడ్డు పక్కన పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం ప్రయివేటు బస్సు కిందకు వచ్చి ఇరుక్కుంది. 300 మీటర్లు బస్సు ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌లో ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బస్సు దాదాపుగా కాలి బూడిదైంది. క్షతగాత్రుల్లో 12 మందిని కర్నూలు జిజిహెచ్‌కు తరలించారు.

ప్రమాద సమయంలో బస్సులో 39 మంది పెద్దలతో పాటు నలుగురు చిన్నారులు ఉన్నారు. వారిలో 23 మంది పెద్దలు, ఇద్దరు చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. మరణించిన వారిలో 17 మంది పెద్దలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బస్సులో కాలిబూడిదైన వారిలో ఎపికి చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, బీహార్, ఒడిశాకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. మృతుల్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారు. మృతదేహాలు కాలి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ప్రమాద స్థలాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత్స, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రులు వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక డ్రైవర్ శివ నారాయణను అరెస్టు చేశారు. మరో డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య పరారీలో ఉన్నారు.

### బస్సు ప్రమాదం చాలా బాధాకరం

- ప్రధాని మోడీ



బస్సు ప్రమాదంలో జరిగిన ప్రాణ నష్టం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి.

### గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



బస్సు అగ్ని ప్రమాదంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయం. మృతుల కుటుంబ సభ్యులకు నా సానుభూతిని వ్యక్తం చేస్తున్నా. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి.



### వెంటనే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కర్నూల్ జిల్లా బస్సు ప్రమాదంపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో శుక్రవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు జెన్‌కో సీఎండీ హరీష్‌ను వెంటనే ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. గద్వాల కలెక్టర్, ఎస్పీ అక్కడే అందుబాటులో ఉండాలనీ, బాధిత కుటుంబాలకు అండదండగా ఉండాలని సూచించారు. మరణించిన వారి గుర్తింపుతో పాటు క్షతగాత్రులకు అవసరమైన వైద్యసాయం అందించే చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

# పార్కును పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెం 45 లో నిర్మాణంలో ఉన్న జీహెచ్ఎంసీ 'పెట్ అండ్ ప్లే పార్క్' పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. పలు వివాహ శుభకార్యాలకు హాజరై తిరిగి వస్తున్న సందర్భంలో పార్క్ వద్ద ఆగి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చెత్తా చెదారంతో నిండిన ఆ ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా, పార్క్ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి గారు గతంలో జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో పార్క్‌లో జరుగుతున్న పనులను ముఖ్యమంత్రి గారు ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పార్క్‌లో పనిచేస్తున్న కూలీలకు ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. పనులకు సంబంధించిన వివరాలతో పాటు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఒక కీలక సమావేశం జరగనుంది. ఆ సమావేశానికి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకానున్నారు. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డీసీసీ అధ్యక్షుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు తెలంగాణకు 22 మంది పరిశీలకులను నియమించింది. ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఏఐసీసీ సీనియర్ నాయకులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. ఈ నెలాఖరు వరకు డీసీసీ అధ్యక్షులను నియమించనున్నారు. ఆయా పదవుల కోసం జిల్లాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా, ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు ఢిల్లీలో ఉండనున్నారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రులను కూడా సీఎం కలిసే అవకాశం ఉందని సమాచారం.

# రూ.11 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు

- 32 ప్యాకేజీల్లో 400 రోడ్లు నిర్మిస్తాం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో రూ. 11 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు నిర్మిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. 32 ప్యాకేజీల్లో 400 రోడ్లను నిర్మిస్తామని ప్రకటించారు. టెండర్లల్లో చిన్న కాంట్రాక్టర్లు సైతం పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష చేశారు హ్యామ్ రోడ్ల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. . వచ్చే రెండేండ్లల్లో దేశానికే రోల్ మోడల్‌లా రాష్ట్రంలో రోడ్లను నిర్మిస్తామన్నారు. అద్దం లాంటి రోడ్లకు కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణ నిలవబోతున్నదని అభిప్రాయపడ్డారు. రోడ్ల నిర్మాణం జరిగేటప్పుడు వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ లాంటివి చేయొద్దని మంత్రి కోరారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదం బారిన పడి కన్న తల్లిదండ్రులకు శోకాన్ని మిగల్చవద్దని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ. 100 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషిచేశానని వివరించారు. మిగతా రూ.50 కోట్ల పెండింగ్ బిల్లులు కూడా త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న కాంట్రాక్టర్లకు భరోసానిచ్చారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో బిల్లులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి, అందుకు కషి చేసిన ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి బిల్డర్ అసోసియేషన్ దన్యవాదాలు తెలియజేశారు.

# జూబ్లీహిల్స్ బరిలో 58 మంది..




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వాటిలో 81 ఆమోదం పొందాయి. అనంతరం 23 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో చివరికి 58 మంది అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉన్నారు. ఇందులో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇంత మంది పోటీ చేయడం ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది, 2023లో 19 మంది పోటీ పడ్డారు.

### జూబ్లీహిల్స్ ఉపఎన్నికల తుది ఓటర్ల జాబితా విడుదల

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వీ. కర్ణన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత 2,383 మంది కొత్త ఓటర్లు చేరారని ఆయన వివరించారు. ఇక తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ. 2.84 కోట్లు నగదు, రూ. 3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 139 లోకేషన్లలో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

గత ఎన్నికలతో పోల్చితే ఈ నియోజకవర్గంలో 1.61 శాతం ఓటర్లు పెరిగారని చెప్పారు. అదేవిధంగా, 80 ఏండ్లకు పైబడిన ఓటర్లు 6,052 మంది (పురుషులు 3,280, మహిళలు 2,772)గా ఉన్నారు. 18-19 ఏండ్ల వయస్సు గల యువ ఓటర్లు 6,106 మందిగా నమోదయ్యారు. మొత్తం వికలాంగ ఓటర్లు 1,891 మంది ఉన్నారు. వీరిలో చూపులేని వారు 519 మంది, శారీరక వైకల్యం ఉన్న వారు 667 మంది, వినికిడి లోపం ఉన్న వారు 311 మంది, ఇతర వైకల్యాలు కలిగిన వారు 722 మంది ఉన్నారు. అదనంగా ఎన్నారై ఓటర్లు 95 మంది ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# రాష్ట్రంలో దండుపాళ్యం ముఠా పాలన

- తెలంగాణలో 'మాఫియా' రాజ్యం: గన్ కల్చర్, అవినీతి..
- తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత పోరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్



తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పాలన, అవినీతి, అధికారుల తీరు వంటి అంశాలపై కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో అవినీతి కంపు రాష్ట్రవ్యాప్తంగా కొడుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణను తాము అగ్రికల్చర్‌లో అగ్రస్థానంలో నిలబెట్టామని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్రంలోకి 'గన్ కల్చర్' తీసుకువచ్చిందని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి బలహీన ముఖ్యమంత్రిని చూడలేదని కేటీఆర్ అన్నారు. స్వయంగా ఒక మంత్రి ఇంట్లోకి టాస్క్‌ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుడిని మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో నిందితుడు స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, ఆప్తుడు రోహిన్ రెడ్డి అని కేటీఆర్ పేర్కొన్నారు. మంత్రి కుమార్తె స్వయంగా ముఖ్యమంత్రిగా నిలిచి రోహిన్ రెడ్డిని పంపించారని ఆరోపించినప్పుడు, సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశంపై స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తనపై స్వయంగా మంత్రి వీడే ఆరోపణలు చేసినా, ఆ మంత్రిని పక్కకు జరపలేకపోతున్నారని, కనీసం ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు.

ముఖ్యమంత్రికి తన పరిపాలన పైన, మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. "దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణ పట్టిన శని పోతుంది" అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారని, వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదు అంటూ అధికారులు పారిపోతున్నారని కేటీఆర్ తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లే వారు వాలంటరీ రిటైర్మెంట్ (వీఆర్ఎస్) తీసుకుంటున్నారని ఆరోపించారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే 'దండుపాళ్యం ముఠా' రాష్ట్రంలో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు, దండుపాళ్యం ముఠానే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. తను చెప్పిన పని చేయలేదని చెప్పి%ౌ% రిజ్వీ వీఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు గనుక భాగస్వాములు అయితే, గతంలో వత్తాసు పలికిన మాదిరిగానే అధికారులు మళ్లీ జైలుకు వెళ్లవలసి వస్తుందని అన్నారు.

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు విలయతాండవం చేస్తున్నాయని, రాష్ట్రంలో 'ఇందిరమ్మ రాజ్యం' కాదని, 'మాఫియా రాజ్యం' నడుస్తోందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శించాయి. ముఖ్యమంత్రి, మంత్రుల ఆధ్వర్యంలో రాచరిక పాలన కొనసాగుతోందని ఆరోపిస్తూ, అధికారులు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశాయి.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో %-% గ్రామస్థాయి నుంచి రాష్ట్ర సచివాలయం వరకు %-% అవినీతి కొనసాగుతున్నదని ప్రతిపక్ష నాయకులు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మంత్రులు కూడా వందల కోట్లు సంపాదించాలనే పోటీలో ఉన్నారని ఆరోపించారు. మంత్రుల అవినీతి వాటాల పంచాయతీలకు అధికారులు దూరంగా ఉండాలని, గతంలో మాదిరి అధికారులకు కూడా శిక్ష పడుతుందని హెచ్చరించారు. వ్యాపారవేత్తలను 'గన్నులు పెట్టి బెదిరించడంతో' రాష్ట్రంలో వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఉందని విమర్శించారు. స్వయంగా ఒక మంత్రి కూతురు రాష్ట్రంలో 'గన్ కల్చర్' నడుస్తున్నదని, పారిశ్రామికవేత్త నెత్తిన గన్ పెట్టి బెదిరించారని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయకుండా మంత్రి కుమార్తె ఆపితే, స్వయంగా మంత్రే తన కారులో తీసుకెళ్లిపోయిన ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంత రాచకం కొనసాగుతుంటే, పోలీసులు ఏం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల యజమానులకు తుపాకీలు పెట్టినప్పుడు, మంత్రులు వాటాల పంచాయతీతో బజారుకెక్కినప్పుడు, సీనియర్ అధికారులు పారిపోతుంటే పోలీసు యంత్రాంగం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు.

మిగితా 2వ పేజీలో

### బిహార్‌లో అన్ని రికార్డులు బద్దలవుతాయి

- ఇండియా కూటమి నాయకులు బెయిల్‌పై బయట తిరుగుతున్నారు
- లాంతర్ల యుగం ముగిసింది
- ప్రధాని మోదీ

వివరాలు 4వ పేజీలో

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ కీలక విచారణ..



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన పార్టీ ఫిరాయింపుల విచారణకు రంగం సిద్ధమైంది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేడు ప్రత్యక్ష విచారణను పునఃప్రారంభించనున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) కింద ఈ విచారణను వేగవంతం చేశారు. నేటి విచారణలో పలువురు ఎమ్మెల్యేల భవితవ్యం తేలనుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

నేడు నాలుగు కీలక పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ విచారణ చేపట్టనున్నారు. పిటిషనర్లు (బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు) మరియు ప్రతివాదులు (ఫిరాయింపు ఎమ్మెల్యేలు) తమ న్యాయవాదుల ద్వారా మౌఖిక వాదనలు, క్రాస్ ఎగ్జామినేషన్స్ జరపనున్నారు.

అనుమతి లేకుండా సామాన్య సందర్శకులను అసెంబ్లీ లోపలికి అనుమతించరు. మీడియా సిబ్బందికి అసెంబ్లీలోకి అనుమతి లేదు. మీడియా పాయింట్ వద్ద ఎలాంటి ప్రెస్ బ్రీఫింగ్ నిర్వహించడాన్ని నిషేధించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వారి పార్టీ కార్యాలయాల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ కీలక విచారణ నేపథ్యంలో, అసెంబ్లీ ప్రాంగణంలో భద్రతను పటిష్టం చేసి కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు.

# రాష్ట్రంలో దండుపాళ్యం ముఠా పాలన

(మొదటి పేజీ తరువాయి)

మంత్రుల అవినీతి వాటాల పంచాయతీలకు అధికారులు దూరంగా ఉండాలని, లేదంటే గతంలో మాదిరి వారికి కూడా శిక్ష పడే అవకాశం ఉందని ప్రతిపక్షం విజ్ఞప్తి చేసింది. ఇద్దరు మంత్రులు రెండు మూడు రోజులపాటు తిట్టుకొని, ఆ తరువాత ముఖ్యమంత్రి మరియు మంత్రి ఇద్దరూ కలిసి శాలువాలు కప్పుకుని, స్వీట్లు పంచుకోవడంపై ప్రతిపక్షాలు విమర్శించాయి. 'ఏం ఉద్ధరించారని ముఖ్యమంత్రికి శాలువా కప్పి పీసీసీ ప్రెసిడెంట్ సన్మానం చేశాడు', 'ఇద్దరు మంత్రులు కలిసి ఏం పొడిచారని పీసీసీ ప్రెసిడెంట్ స్వీట్లు పంచారు' అని ప్రశ్నించారు. ఇద్దరి మధ్య ఏం సెటిల్మెంట్ జరిగిందని ఈ కలరింగ్ ఇచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. వాటాల పంచాయతీ, అవినీతి సొమ్ముల పంపకాలు, టెండర్ల రిగ్గింగ్ వంటివి కాంగ్రెస్ పార్టీ 'ఇంటి పంచాయతీ' లెక్క మారిపోయాయని, ముఖ్యమంత్రి ఇల్లు సెటిల్మెంట్‌లకు కేంద్రంగా మారిపోయిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. తుపాకీ బెదిరింపుల విషయంలో కూడా రెండు విభిన్న వాదనలు తెరపైకి వచ్చాయి. మంత్రి కుమార్తె 'తుపాకీ ఇచ్చింది రేవంత్ రెడ్డి, తెచ్చింది రోహిన్ రెడ్డి, అక్కడ ఉన్నాడు' అని చెప్పగా, పోలీసులు మాత్రం 'గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్' అని చెప్తున్నారని అన్నారు. అయితే, రెండు అంశాల్లో కూడా బెదిరింపులు గన్నుతో జరిగాయనేది వాస్తవమని అన్నారు.

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గనుల బెదిరింపుల వ్యవహారంలో పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రతిపక్ష నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం సంఘటనపై రాష్ట్ర డీజీపీ మౌనంగా ఉండటంపై వారు ప్రశ్నించారు. "నాకు పింకు బుక్కులు లేవు, రెడ్డి బుక్కులు లేవు, కేవలం కాకీ బుక్కు మాత్రమే రాష్ట్రంలో ఉంటుందని గొప్పలకు పోయిన రాష్ట్ర డీజీపీ ఏం చేస్తున్నారు?" అని ప్రతిపక్ష నేతలు నిలదీశారు. తమ కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని కేటీఆర్? మండిపడ్డారు.

నిజంగా డీజీపీకి నిజాయితీగల పేరు ఉంటే, గనుల బెదిరింపు వ్యవహారంలో తక్షణ చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. "పోలీస్ యంత్రాంగానికి చిత్తశుద్ధి ఉంటే, గన్ను తెచ్చింది ఎవరు, గన్ను గురిపెట్టింది ఎవరు అనే విషయాన్ని తేల్చాలి" అని అన్నారు. ఈ అంశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని విచారణ చేసి ఆయన అభిప్రాయాన్ని రికార్డు చేయాలని, అలాగే సుమంత్‌ను విచారించి నిజానిజాలు బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ మొత్తం గన్నుతో గురిపెట్టిన సంఘటనలో కచ్చితంగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖలో 99 శాతం మంది బాగానే ఉన్నారని, నీతిమంతులు ఉన్నారని అంగీకరిస్తూనే, "కానీ ఒక్క శాతం మంది మాత్రం కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు. వారినే మేము ఈరోజు నిందిస్తున్నాము" అని ప్రతిపక్ష నేత స్పష్టం చేశారు. మంచిరేవుల భూముల కోసం గన్ను పెట్టి బెదిరిస్తున్నారని మంత్రి కూతురు స్వయంగా చెప్పినప్పుడు పోలీసులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. "మంత్రులు ఎక్కడ సంతకం పెట్టారో సొంత కుటుంబ సభ్యులకు కూడా తెలవకూడదు అన్న నియమాలు ఉన్నాయి. ఇవన్నీ మంత్రి బిడ్డకు తెలపడం, జపాన్‌లో ఉన్న ముఖ్యమంత్రి ఫైలు వెనక్కి తెప్పించుకోవడం ఇదంతా ఆరాచకంగా మారింది" అని అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే పార్టీలోని నేతల మధ్య విభేదాలు, భూ వివాదాలు, టెండర్ల వ్యవహారాలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా మంచిరేవుల భూమి పంచాయితీ, మంత్రులు, వారి కుటుంబ సభ్యుల మధ్య కాంట్రాక్టులు, కమీషన్ల విషయంలో జరుగుతున్న ఘర్షణలు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నాయని, ముఖ్యమంత్రి సోదరుడు 15 ఎకరాలు, మంత్రి కొండా సురేఖ 15 ఎకరాలు కలిపి మొత్తం 30 ఎకరాల మంచిరేవుల భూమి విషయంలో తలెత్తిన వివాదం కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత కలహాలకు అద్దం పడుతోంది. ఈ భూమి తమకే కావాలని మంత్రి, రేవంత్ రెడ్డి, కొండా సురేఖ వంటి ముఖ్య నేతలు కొట్లాడుతున్నట్లుగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలు బహిరంగమవడం రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇస్తున్న సందేశం ఏమిటనే ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.


మంత్రులు కాంట్రాక్టులు, కమీషన్ల వ్యవహారాన్ని ఇంటి పంచాయితీగా మార్చారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మంత్రి కూతురు స్వయంగా "పొంగులేటి నా టెండర్లలో తలదూర్చారు" అని చెప్పడం, బెదిరింపులు, టెండర్ల రిగ్గింగు వంటి అంశాలు బహిరంగంగా చర్చకు రావడం దేశ చరిత్రలో ఇంతవరకు జరగలేదని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. టెండర్ల రిగ్గింగు వ్యవహారంలో మంత్రి కూతురు 'ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేశాను' అని చెప్పినప్పటికీ, పోలీసులు ఉత్తమ్ కుమార్ రెడ్డిని విచారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, దక్కన్ సిమెంట్ కంపెనీ యజమానిపై గన్ గురిపెట్టిన విషయంలోనూ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోహిన్ రెడ్డి, సుమంత్‌లను పోలీసులు విచారించకపోవడంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంత బహిరంగంగా అవినీతి అంశాలు, బెదిరింపులు బయటపడినప్పటికీ పోలీసుల దర్యాప్తు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో ఇంత అరాచకం, అవినీతి జరుగుతున్నా బీజేపీ నాయకులు స్పందించకపోవడంపై విమర్శకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ %–% కాంగ్రెస్ 'జాయింట్ వెంచర్' పరిపాలన నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, అమిత్ షా వంటివారు మౌనంగా ఉండటం, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా స్పందించకపోవడం చూస్తుంటే బీజేపీ తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడలేదు అనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన, అవినీతిని చూసి అసహ్యించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. 'వంద రోజులలో అన్నీ చేస్తాం' అని చెప్పి ప్రజలను మోసం చేశారని, పరిపాలన, ప్రజా పాలన లేదని, కేవలం అరాచకాలు, అవినీతి, బెదిరింపులు, కమీషన్లు, టెండర్ల రిగ్గింగ్ వంటివే నడుస్తున్నాయని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.అనుభవజ్ఞుడైన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూడా తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం 'కల' అనే మాట చెప్పడం, ఈ అరాచక, అవినీతితో కూడిన పరిపాలనను ఆయన చూసి ఉండరని, అందుకే ప్రజల ఆకాంక్షలను వ్యక్తపరిచారని అన్నారు. తెలంగాణ ప్రజల అభిప్రాయానికి అద్దం పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఆయనకి తెలంగాణ ప్రజల అభిప్రాయాన్ని ఆకాంక్షలను వ్యక్తపరిచినందుకు మా పార్టీ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

# పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పారామెడికల్ కళాశాలల్లో రెండేళ్ల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖా అధికారి కార్యాలయం ఒక పత్రికా ప్రకటనలో తెలపడం జరిగింది.

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ముఖ్యంగా, బై.పి.సి గ్రూప్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆసక్తిగల మరియు అర్హులైన అభ్యర్థులు www.tgpmb.telangana.gov.in అనే వెబ్‌సైట్ నుండి అప్లికేషన్ ఫారంను డౌన్‌లోడ్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారంతో పాటు, దానికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ సెట్‌ను అక్టోబర్ 28, 2025లోగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించగలరు. నోటిఫికేషన్ మరియు ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు రాజన్న సిరిసిల్ల జిల్లా వెబ్‌సైట్‌ను గాని, లేదా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ నోటీస్ బోర్డును గాని సందర్శించగలరని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలియజేశారు.





# బీఆర్ఎస్ కార్యాలయ కార్యదర్శికి జన్మదిన శుభాకాంక్షలు

**బలగం టీవీ, ఎర్రవల్లి**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి హరిష్ రావు శుక్రవారం నాడు బీఆర్ఎస్ ఎల్పీ (శాసనసభాపక్ష) కార్యాలయ కార్యదర్శి ఎం. రమేష్ కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రమేష్ కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్, కేటీఆర్‌లు ఆయనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేసినట్టు సమాచారం. రమేష్ కుమార్ రెడ్డి నిబద్ధతతో కూడిన సేవలను వారు అభినందించారు. వీరితో పాటు పలువురు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు), శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీలు), మాజీ ఎమ్మెల్యేలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన హెచ్‌వైసీ వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ యూత్ కరేజ్ (హెచ్. వై .సి ) వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్ ఈరోజు బీఆర్ఎస్ (భారత్ రాష్ట్ర సమితి)లో వర్కింగ్ ప్రెసిడెంట్ కే. టీ. రామారావు (కేటీఆర్) సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా సల్మాన్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ, దాని నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో తన నామినేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా అడ్డుకుందని ఆరోపించారు.

ఈ సందర్భంగా హెచ్. వై .సి వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ.. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో తన నామినేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా అడ్డుకుందని, పోటీకి దూరంగా ఉంచేందుకు కాంగ్రెస్ నేతలు ఎన్నో ప్రయత్నాలు చేశారని సల్మాన్ ఖాన్ ఆరోపించారు. నిన్నటి నుండి పెద్ద పెద్ద కాంగ్రెస్ నాయకులు తనను కొనేందుకు విశ్వ ప్రయత్నం చేశారని, కాంగ్రెస్‌లో చేరితే ఏమీ కావాలంటే అది చేసి పెడతామని ఆశ చూపారని తెలిపారు. అయితే, తాను అమ్ముడు పోయే వాణ్ని కాదని స్పష్టం చేసి, కేటీఆర్‌ను కలిశానని పేర్కొన్నారు. తెలంగాణ కోసం పోరాడిన యోధుల పార్టీలోనే చేరాలని తన అభిమానులు సూచించారని, కష్టకాలంలో బీఆర్ఎస్ తనను అక్కున చేర్చుకుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు కనీసం స్మశాన వాటిక కూడా కేటాయించలేదని, ఇక ఏమి ఇస్తుందని ప్రశ్నించారు. ముస్లింల ఓట్లు దండుకుని వారిని ధోఖా చేసిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. కాంగ్రెస్‌లో ముస్లిం నాయకులను కుట్ర పూరితంగా ఎదగనివ్వడం లేదని, ప్రస్తుతం కాంగ్రెస్ లో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లేరని, కేబినెట్‌లో కూడా ముస్లింలకు స్థానం కల్పించలేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సెక్యులర్ విలువలను మంట గలుపుతున్నారని, గంగా జమునా తెహజీబ్‌ను కాపాడిన నాయకులు కేసీఆర్, కేటీఆర్ అని సల్మాన్ ఖాన్ కొనియాడారు. గతంలో కేసీఆర్, కేటీఆర్‌లను బాధ పెట్టే విధంగా మాట్లాడినందుకు ఈ సందర్భంగా క్షమాపణ చెప్పారు. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలవడం ఖాయమైపోయిందని, వచ్చే ఎన్నికల్లో అధికారం లోకి వచ్చేది బీఆర్ఎస్సేనని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీ హిల్స్‌లో ప్రతి ఇంట్లో బీఆర్ఎస్ గెలవాలని కోరుకుంటున్నారని, జూబ్లీ హిల్స్ లో బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తి ఆపలేదని స్పష్టం చేశారు. తెలంగాణ అంతటా గులాబీ జెండా ఎగిరేలా తమ హెచ్‌వైసీ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వం లో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి..

**-వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి**

**-ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**



**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 17 తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కుప్పలు పరిశీలించారు. ఇప్పటి దాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారో ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని అన్నారు. గన్ని సంచులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, డీసీఎస్ఓ చంద్ర ప్రకాశ్, తహసీల్దార్ జయంత్, ఏపీఎంలు సిబ్బంది ఉన్నారు.

# పేదల సొంతింటి కల నేడు నెరవేరుతుంది...

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పేదల స్వంత ఇంటి కల నేడు ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని,దేశ వ్యాప్తంగా ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వడం లేదని,కేవలం ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఇస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి అర్బన్ మండలం గుర్రవానిపల్లె గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి,శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల స్వంత ఇంటి కల నేడు ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు పక్క ఇల్లు ఉండాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. రాష్ట్రంలో రాజకీయాలకు పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని,

ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని, ఇళ్లు లేని వారికి ఇల్లు కల్పించడం కోసం ప్రభుత్వం 5 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తుందని అన్నారు.గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తానని మోసం చేసిందని అన్నారు. పట్టణంలో గ్రామాల్లో పండగ వాతావరణం లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని,

ఇప్పటికే కొందరికి బేస్మెంట్ లెవెల్ పూర్తయి, కొందరికి స్లాబ్ దశలో ఉండి తమ తమ ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. నిస్సహాయులకు సహాయాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని,లబ్ధిదారులు మాటలు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.గతంలో పూరి గుడిసెల్లో రేకుల షెడ్లల్లో నివసించే వారమని ప్రజా ప్రభుత్వం లో ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు మంజూరు అయ్యిందని సంతోషంగా చెప్తున్నారని అన్నారు.

పేదలకు నాడు ఇందిరమ్మ ఇల్లే,నేడు కూడా మళ్లీ ఇందిరమ్మ ఇల్లే అని,ఆనాడు ఇందిరమ్మ పేద ప్రజల కోసం ఆలోచించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు.ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, తెలంగాణ దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని అన్నారు.



# పోలీసులకు వ్యాస రచన పోటీలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని అదనపు ఎస్పీ చంద్రయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బందికి రెండు కేటగిరీలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పోలీస్ కానిస్టేబుల్ నుండి ఏఎస్సై వరకు గల సిబ్బందికి పనిప్రదేశంలో లింగ వివక్ష అనే అంశంపై, ఎస్సై మరియు ఆపై స్థాయి అధికారులకు నేల స్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయడం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన అన్ని పోలీసు స్టేషన్లు,వింగ్స్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు రమేష్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# తేనెటీగల దాడిలో గాయపడిన పత్తి కూలీలను పరామర్శించిన చల్మెడ

**బలగం టీవీ, కోనరావుపేట :**

కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన దాదాపు 18 మంది పత్తి కూలీలను తేనెటీగల దాడిలో తీవ్ర గాయాలపాలవగా, బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం సిరిసిల్ల ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. రైతులు కనగర్తి-సుద్దాల గ్రామాల మధ్య ఉన్న చేనులోకి పని నిమిత్తం వెళ్ళగా, తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు వెంటనే ఆసుపత్రికి చేరుకుని, గాయపడిన రైతుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు ఆయన సూచించారు.ఆయన వెంట



మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సీనియర్ నాయకులు చంద్రయ్య, మంతెన సంతోష్, లక్ష్మణ్, మహేందర్, శివతేజ తదితరులు ఉన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో

# విద్యుత్ కనెక్షన్, నీరు, టెంట్ వసతి కల్పించాలి

**-కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలి**

**-ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

ఈ ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం, పత్తి, మక్కలు ఇతర పంటల కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఆయా పంటల ఉత్పత్తుల సేకరణ, చేయాలిసిన ఏర్పాట్లు తదితర అంశాలపై పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, ఐకెపి, మెప్మా, డీసీఎంఎస్ తదితర అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయం ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఏఏ పంటల ఉత్పత్తి ఎంత వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారిని ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

మొత్తం జిల్లాలో 238 కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయగా, ఇప్పటివరకు 171 కొనుగోలు కేంద్రాలు ఐకెపి, పిఎసిఎస్, మెప్మా డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయని, మిగతావి వారం రోజుల్లోగా ప్రారంభిస్తారని ఆయా శాఖల అధికారులు ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వ్యవసాయ అధికారులు అంచనా వేశారని అన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రెండు లక్షల 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నామని అన్నారు. ఈ మేరకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, టెంట్లు, నీటి వసతి విద్యుత్ వసతి పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. గన్ని సంచుల కొరతలేదని ఇంకా కావాల్సినవి తెప్పించాలని ఆదేశించారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సిసిఐ ఆధ్వర్యంలో రైతులకు లికపాస్ కిసాన్‌లి యాప్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మక్కల కొనుగోలు కేంద్రాల ప్రారంభమయ్యాయని ఆయా మండలాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, డిఆర్డిఓ శేషాద్రి, డీసీ ఎస్ ఓ చంద్ర ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల భోధన ఎలా ఉంది...?

**-ఉద్యోగాలు, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి ఆదర్శంగా నిలవాలి..**

**-ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**



**బలగం టీవీ తంగళ్లపల్లి**

మీ అధ్యాపకుల భోధన ఎలా ఉంది,పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు,మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ అడిగి తెలుసుకున్నారు.శుక్రవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఎవరైనా సెలవులో ఉన్నారా, సెలవుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. కిచెన్ లో మెనూ చార్ట్ ను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న కూరగాయలు, కోడిగుడ్లు పరిశీలించారు. నాణ్యత సరిగా లేకపోవడంతో వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సరకుల వివరాల రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థుల వసతి గదులు పరిశీలించి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.

ఈ సందర్బంగా ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ ఉద్యోగాల్లో, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతి విద్యార్థిని నిత్యం విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబర్చి టీచర్, లాయర్, ఇంజనీర్, డాక్టర్, తదితర రంగాల్లో స్థిరపడాలని, ఆర్థికంగా స్వతంత్రత సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదిగితే తమ ప్రాంతంలోని మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారనిఅన్నారు. మెనూ లో అందించే పోషకాహారం ఖచ్చితంగా తినాలని సూచించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే మీరు నిర్దేశించుకున్న లక్ష్యం ఎంత పెద్దదైనా అది సాధించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సులభతరం అవుతుందని, ఈ విషయాన్ని గ్రహించి చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తనిఖీలో తహశీల్దార్ జయంత్, ప్రిన్సిపాల్ రాధ, తదితరులు ఉన్నారు.

# అఖండ 2 బ్లాస్టింగ్ రోర్



బలగం టీవీ, హైదరాబాద్

పూనకాలు రావాల్సిందే. ఈ కాంబోలో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ సినిమాలు బ్లాక్‌బస్టర్ అయ్యారు. ఈ హ్యాట్రిక్ విజయాల తర్వాత ఈ కాంబోలో వస్తున్న నాలుగో చిత్రం 'అఖండ 2 తాండవం'. 2021లో వచ్చిన అఖండ సినిమాకు ఇది సీక్వెల్. ఈ సినిమా నుంచి కొద్ది రోజుల క్రితం వచ్చిన అప్‌డేట్స్ సినిమాపై మరింత హైప్ పెంచేశాయి. తాజాగా బ్లాస్టింగ్ రోర్ అంటూ చిన్న టీజర్‌ని వదిలింది చిత్ర యూనిట్. ఈ వీడియోలో బాలకృష్ణ, బోయపాటి స్టైల్‌లో యాక్షన్ అదరగొట్టారు. "సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో.. ఏ సౌండ్‌కి నవ్వుతానో.. ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు" అంటూ బాలయ్య పవర్‌ఫుల్ డైలాగ్‌తో కేక పెట్టించారు. ఇక ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్‌గా నటిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. సంయుక్త ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై ఎం తేజస్విని నందమూరి సమర్పణలో ఈ సినిమా డిసెంబర్ 5న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది. తమన్ ఈ సినిమాకు సంగీతం అందించారు.

# బిహార్‌లో అన్ని రికార్డులు బద్దలవుతాయి

- ఇండియా కూటమి నాయకులు బెయిల్‌పై బయట తిరుగుతున్నారు
- లాంతర్ల యుగం ముగిసింది
- ప్రధాని మోడీ

బలగం టీవీ, హైదరాబాద్



బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డీఏ కూటమి అన్ని ఎన్నికల రికార్డులను బద్దలు కొట్టబోతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ప్రతిపక్ష ఇండియా కూటమి బెయిల్‌పై బయట తిరుగుతున్న నాయకుల చేతుల్లో ఉందని ఆయన విమర్శించారు. శుక్రవారం బిహార్‌లోని సమస్తీపూర్‌లో జరిగిన ఎన్‌డీఏ ప్రచార సభలో ప్రధానమంత్రి మాట్లాడారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతుల్లో పట్టుకొని తిరుగుతున్న నేతలే దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

"వేల కోట్ల రూపాయల అవినీతి కేసుల్లో బెయిల్‌పై బయట ఉన్న కాంగ్రెస్, ఆర్జేడీ నాయకులు భారతరత్న కర్పూరీ ఠాకూర్ లాంటి మహనీయుల బిరుదు కోసం పోటీపడటం సిగ్గుచేటు," అని మోదీ ఎద్దేవా చేశారు.

**లాంతరు యుగం ముగిసింది!**

సభలో ఉన్న ప్రజలను ఉద్దేశించి మోదీ తమ ఫోన్లలోని టార్చ్ లైట్లు ఆన్ చేయమని కోరారు. క్షణాల్లో వేలాది లైట్లు మెరిపించడంతో వేదిక వెలుగులతో నిండిపోయింది.

"ప్రజల చేతుల్లో ఇప్పుడు ఆధునిక గాడ్జెట్లు ఉన్నాయి. ఇక లాంతర్ల అవసరం లేదు," అంటూ ఆర్జేడీ పార్టీ లాంతరు గుర్తుపై సెటైర్లు వేశారు. "2005లో బిహార్ 'జంగిల్‌రాజ్' నుంచి విముక్తి పొందింది. నీతీశ్ కుమార్ సారథ్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడింది. అప్పట్లో కేంద్రంలో కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి ఉండేది. ఆ ప్రభుత్వం బిహార్ అభివృద్ధికి అడ్డు తగిలింది," అని మోదీ ఆరోపించారు.

బిహారీల ఓటు హక్కుపై అక్కసుతో ఆర్జేడీ పార్టీ ప్రతీకార భావంతో ప్రవర్తించిందని, నీతీశ్ ప్రభుత్వం సాయం కోరినప్పుడల్లా కేంద్ర మద్దతు ఉపసంహరిస్తామని బెదిరించిందని ఆయన విమర్శించారు. "మేం గత 11 ఏళ్లలో బిహార్‌కు బడ్జెట్ కేటాయింపులను మూడు రెట్లు పెంచాం. బిహార్‌లో పండే మఖానా ఇప్పుడు విదేశాలకు ఎగుమతి అవుతోంది. ప్రతి జిల్లాలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం," అని మోదీ తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ నిధులు ప్రజలకు చేరకుండా మధ్యలో మాయమయ్యేవని గుర్తుచేశారు. "ఆర్జేడీ హయాంలో మావోయిస్టులు బలపడ్డారు. వందలాది హత్యలు జరిగాయి.కానీ మేం 2014లో అధికారంలోకి వచ్చాక మావోయిజం వెన్ను విరిచాం.త్వరలోనే భారత్ మావోయిజం నుంచి పూర్తిగా విముక్తి పొందుతుంది %–% ఇది మోదీ గ్యారంటీ," అని ఆయన హామీ ఇచ్చారు.



## సీఎంను పెండ్లికి ఆహ్వానించిన నారా రోహిత్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ హీరో నారా రోహిత్ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. నటి శిరీష లేళ్లను వివాహం చేసుకోబోతున్న రోహిత్ పెళ్లి వేడుక అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో పెళ్లి ఏర్పాట్లలో బిజీగా ఉన్న రోహిత్ తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తన వివాహానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వివాహ వేడుకలను నారా కుటుంబం నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. అక్టోబర్ 25న హల్దీ, 26న పెళ్లికొడుకు కార్యక్రమం, 28న మెహందీ వేడుకలు జరగనున్నాయి. అక్టోబర్ 30న రాత్రి 10.35 గంటలకు శుభముహూర్తాన రోహిత్, శిరీషలు ఏడడుగులు వేయనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారు.

'ప్రతినిధి–2' సినిమా షూటింగ్ సమయంలో రోహిత్, శిరీషల మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఇరువురి కుటుంబాల అంగీకారంతో గతేడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం జరిగింది. ఆ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు హాజరై ఆశీర్వదించారు. అయితే ఆ తర్వాత రోహిత్ తండ్రి రామ్మూర్తి నాయుడు మరణంతో పెళ్లి వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ శుభముహూర్తం ఖరారవడంతో నారా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం రోహిత్ స్వయంగా సినీ, రాజకీయ ప్రముఖులను కలుసుకుంటూ శుభలేఖలు అందిస్తున్నారు.

## సంస్కరణలు లేకపోతే ఐక్యరాజ్య సమితి అస్తిత్వానికే ముప్పు

- 80వ వార్షికోత్సవంలో భారత్

బలగం టీవీ, హైదరాబాద్

బాధితులను, ఉగ్రవాదులను ఒకే గాటన ఎలా కడతారని ప్రశ్న అత్యవసరంగా సంస్కరణలు తీసుకురాకపోతే ఐక్యరాజ్య సమితి పనితీరు మొత్తంగా స్తంభించిపోతుందని విదేశాంగ మంత్రి జై శంకర్ విమర్శించారు. పహల్గాం ఉగ్ర దాడికి బాధ్యురాలైన ఉగ్రవాద సంస్థను భద్రతా మండలిలో వెనకేసుకు వచ్చేందుకు పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను ఈసందర్భంగా ఉటంకిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్య సమితి 80వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ వ్యూహం పేరుతో బాధితులను, ఉగ్రవాదానికి పాల్పడుతున్నవారిని ఒకే గాటన కట్టడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఐక్యరాజ్య సమితి తీరు బాగా లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. యుఎన్‌లో జరిగే చర్చలు రాన్రాను ఏకపక్షంగా మారిపోతున్నాయన్నారు. మొత్తంగా దాని పనితీరును పరిశీలిస్తే స్పష్టంగా ప్రతిస్తంభనకు గురైనట్లు కనిపిస్తోందన్నారు. సంస్కరణల ప్రక్రియను ఉపయోగించే ఏ అర్థవంతమైన సంస్కరణనైనా అడ్డుకుంటారని అన్నారు. ఐక్యరాజ్యసమితిని తిరిగి కొత్తగా నిర్వచించడం ప్రపంచ దేశాల ముందున్న పెను సవాలని అన్నారు. భద్రతా మండలి సభ్యురాలే బహిరంగంగా పహల్గాం వంటి పాశవిక ఉగ్ర దాడికి బాధ్యురాలైన సంస్థను కాపాడుతోంది. ఇక బహుళవాదానికి విశ్వసనీయత ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్ పేరును జై శంకర్ ప్రత్యక్షంగా ప్రస్తావించకపోయినా ఆయన వ్యాఖ్యలను పరిశీలిస్తే ఆయన స్పష్టంగా పాక్‌ను ఉద్దేశించే అన్నారని తెలిసిపోతోంది. తమకు తాము టెర్రరిస్టులమని ప్రకటించుకున్న వారిని ఆంక్షల ప్రక్రియ నుండి కాపాడుతున్నపుడు ఇక బాధ్యత గల స్థానాల్లో కూర్చున్నవారి నిజాయితీ ఏమిటో అర్థమవుతోందన్నారు. పాకిస్తాన్ ప్రస్తుతం భద్రతా మండలి సభ్య దేశంగా వుంది. జులై మాసానికి అధ్యక్ష స్థానంలో బాధ్యత వహించింది.



# ఢిల్లీలో కబడ్డీ కబడ్డీ

- అక్టోబర్ 25 నుంచి 31 వరకు ప్లే ఆఫ్స్ పోటీలు
- పుణెరి పల్టన్, ఢిల్లీ జట్లు ముందంజలో

బలగం టీవీ, హైదరాబాద్

ప్రో కబడ్డీ లీగ్ పన్నెండో సీజన్ తుది దశకు చేరుకుంది. ఉత్కంఠభరిత పోరాటాలతో అభిమానులకు కబడ్డీ మజాను పంచిన లీగ్ ఇప్పుడు ప్లే ఆఫ్స్ దశకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 25 నుంచి 31 వరకు ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయని నిర్వహకులు ప్రకటించారు.

**టాప్–8లో బరిలోకి జట్లు**

సీజన్ ఆరంభం నుంచే అదరగొడుతున్న పుణెరి పల్టన్, దబాంగ్ ఢిల్లీ కేసీ జట్లు చెరో 26 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌లో ముందుగానే చోటు దక్కించుకున్నాయి. బెంగళూరు బుల్స్ 22 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇక తెలుగు టైటాన్స్, హర్యానా స్టీలర్స్, యూ ముంబా జట్లు 20 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. చివరి దశలో పుంజుకున్న పట్నా పైరేట్స్, జైపూర్ పింక్ పాంథర్స్ కూడా తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి.

**ప్లే ఆఫ్స్ షెడ్యూల్**

అక్టోబర్ 26: తొలి మ్యాచ్ విజేత ఎలిమినేటర్–1కు దూసుకెళ్తుంది.
అక్టోబర్ 27: మినీ క్వాలిఫయర్‌లో తెలుగు టైటాన్స్ బెంగళూరు బుల్స్ తలపడతాయి.
అదే రోజు ఎలిమినేటర్–2 కూడా జరుగుతుంది.
అక్టోబర్ 28: ఎలిమినేటర్–3,
అక్టోబర్ 29: క్వాలిఫయర్–2,
అక్టోబర్ 31: ఫైనల్ పోరాటం

## 31 నుంచి ఓటీటీలో 'లోక చాప్టర్ 1 చంద్ర'

**ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు**

బలగం టీవీ, హైదరాబాద్




మలయాళంలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'లోక చాప్టర్ 1 చంద్ర' (తెలుగులో కొత్త లోక) చిత్రం ఇప్పుడు ఓటీటీ వేదికపై ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ ఈ చిత్రాన్ని అక్టోబర్ 31 నుంచి మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

గత ఆగస్టు 28న విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకుల నుంచి అపారమైన ఆదరణను దక్కించుకుని ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వసూళ్లు సాధించింది. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, 40 రోజుల్లోనే రూ.300 కోట్ల వసూళ్లు రాబట్టడం విశేషం. ఇది మలయాళ సినీ చరిత్రలో మొట్టమొదటి రూ.300 కోట్లు దాటిన సినిమాగా నిలిచింది.

లోక' మలయాళంలోనే 50,000 షోలు ప్రదర్శించిన తొలి చిత్రంగా కూడా గుర్తింపు పొందింది. ప్రేక్షకుల మన్ననలు పొందిన ఈ చిత్రం మలయాళ సినీ ఇండస్ట్రీలో ఆల్‌టైమ్ హిట్‌గా రికార్డు నెలకొల్పింది. ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో మెప్పించగా, నస్లేన్ హీరోగా నటించాడు. దుల్కర్ సల్మాన్ నిర్మాణ బాధ్యతలు చేపట్టి 'లోక'ను ఇండస్ట్రీ హిట్‌గా నిలిపాడు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు షాక్ ఇవ్వాలి

- హరీష్‌రావు పిలుపు

బలగం టీవీ, హైదరాబాద్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రజలకు ఒక గొప్ప అవకాశం అని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు పేర్కొన్నారు. "రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించడానికి ఈ ఉప ఎన్నికలో ప్రజలు బీఆర్ఎస్‌కు గెలుపు కట్టాలి" అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని విమర్శించిన ఆయన, నిరుద్యోగులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు మోసం చేశారని ఆరోపించారు. "జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ విజయం సాధిస్తేనే వారికీ తమ తప్పు తెలుస్తుంది" అని హరీష్‌రావు వ్యాఖ్యానించారు.

తాను జిఒ 29, జిఒ 55లపై అసెంబ్లీలో గట్టిగా మాట్లాడిన విషయం గుర్తు చేస్తూ, "భట్టి విక్రమార్క దళిత మంత్రిగా ఉన్నా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు నింపండి అంటే జేబులు, గల్లా పెట్టెలు నింపుకుంటున్నారు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. "విద్య రాని వ్యక్తి విద్యాశాఖ మంత్రి, అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రి అయ్యాడు. విద్య, మున్సిపల్, హోం, ముఖ్యమంత్రి పదవుల్లో విఫలమైన రేవంత్ రెడ్డి, కలెక్షన్‌ల మంత్రిగా మాత్రం పాస్ అయ్యాడు" అని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించిందని, కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు, ముఖ్యమంత్రి వ్యాపారులను బెదిరిస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు.